భక్షికుంట చెరువు పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, డీసీ వంశీకృష్ణ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్ భక్షికుంట చెరువు సుందరీకరణతో స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా మారుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో జరుగుతున్న భక్షికుంట చెరువు సుందరీకరణ పనులను చందానగర్ డీసీ వంశీకృష్ణ, స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికికూపంగా మారిన చెరువు పునరుద్ధరణకు ఫినామ్ పీపుల్ ఐటీ కంపెనీ, సీఎస్ఆర్ ఫండ్ ద్వారా బైరీ ఫౌండేషన్‌లు ముందుకు వచ్చాయని వారిని అభినందిస్తున్నామన్నారు. చెరువు సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పనులు త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీకాంతి, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, సందీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుందర్, రఘునందన్, రాజన్న, రమేష్, రాములు, కాశిం తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పైప్‌లైన్‌ను నాలాలోకి కలపండి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురం కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సోమవారం చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌పూర్ మున్సిపాలిటీ నుంచి వచ్చే మురుగు నీటిని నాలాలోకి కలపకుండా భవానీపురం కాలనీ రోడ్ల పైకి వదలడం భావ్యం కాదన్నారు. మురుగునీరు కాలనీ పరిసర ప్రాంతాలలో చేరడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. యుద్ధప్రాతిపదికన నాలాలోకి కలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని ఆయన ఈసందర్భంగా తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీకాంతి, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, సందీప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈద్గవానికుంట పునరుద్ధరణకు పోరాటం

- రెవెన్యూ అధికారుల అండదండలతోనే పూడ్చివేత
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..
- గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

గచ్చిబౌలి: గోపన్‌పల్లి సర్వే నంబర్ 71/1లో ఉన్న ఈద్గవానికుంట పూడ్చివేతపై సాక్షిలో ప్రచురితమైన 'ఈద్గవాని కుంట హాంఫట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గచ్చిబౌలి కార్పొరేటర్ స్పందించారు. చెరువును పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తానని ఆయన ప్రకటించారు. సోమవారం శేరిలింగంపల్లి మండల ఆర్ఐ శ్రీకాంత్‌తో కలిసి ఆయన ఈద్గవానికుంటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట బండరాళ్లు, మట్టితో చెరువును పూడుస్తున్నా చర్యలు తీసుకోవడంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు విఫలమయ్యారన్నారు. భారీ వర్షాలకు కాలనీలు మునక, ఇక వేసవిలో అడుగంటుతున్న భూగర్భ జలాలకు కారణం చెరువులు కనుమరుగు కావడమేనని అన్నారు. ఈ విషయాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జోనల్ కమిషనర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కాగా ఈద్గవాని కుంటలో పట్టాదారుడైన ప్రకాష్ మాట్లాడుతూ తమకు గోపన్‌పల్లి సర్వే నెంబర్ 71/1,71/2లో 2.23 ఎకరాల స్థలం ఉందన్నారు. రిస్టోరేషన్ వర్క్ చేసేటప్పుడు కోర్టుకు వెళ్లామని, నాలా కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. పూడ్చివేతకు పాల్పడింది ఎవరో తెలియదని ఆయన పేర్కొనడం గమనార్హం.



ఈద్గవాని కుంటను పరిశీలిస్తున్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్



కుంట వద్ద జీహెచ్ఎంసీ లేక్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది

మహేశ్వరం 'విశ్వరూపసభ'ను విజయవంతం చేయాలి

రాయదుర్గం: మహేశ్వరంలో ఆగస్టు 2న జరిగే 'విశ్వరూప సభ'ను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డిజిల్లా కన్వీనర్ పెంటనోళ్ళ నర్సింహ్మా మాదిగ కోరారు. శేరిలింగంపల్లిలోని మసీదుబండ అంబేద్కర్ విజ్ఞానకేంద్రంలో నాయకులు కోడిచర్ల ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నందున ప్రతి మాదిగ విద్యార్థి, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంఎస్ఎఫ్ మసీదుబండ అధ్యక్షుడిగా ఆదిత్యమాదిగ

ఎంఎస్ఎఫ్ మసీదుబండ గ్రామ అధ్యక్షుడుగా ఆదిత్య మాదిగను నియమిస్తూ ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డిజిల్లా కన్వీనర్ పెంటనోళ్ళ నర్సింహ మాదిగ ని యామకపత్రాన్ని అందించారు. కోడిచర్ల సాయికుమార్, రామేశ్వరం అర్జున్, హరిజ భరత్‌కుమార్, గజ్జల యాదయ్య, జగన్, మహేందర్, మనోజ్, మల్లేష్‌లను సభ్యులుగా నియమించినట్లు ప్రకటించారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన కార్పొరేటర్



మంత్రి హరీష్‌రావుకు పూలమొక్క ఇచ్చిన కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావును సోమవారం ఆయన నివాసంలో స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బూరుగడ్డ నగేష్, రాకేష్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి..

రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మీయ బంధువు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 320 మంది లబ్ధిదారులకు రూ.3,20,37,120ల కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఏ లోటు రాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి డిప్యూటీటీ తహసీల్దార్ శంకర్, ఆర్ఐ శీనయ్య, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, పూజితగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, వార్డు సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాల నిరసన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సోమవారం విద్యార్థులు నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డిమాండ్లకు రాతపూర్వక హామీ ఇచ్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, బీఎస్ఎఫ్, టీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఫ్రెటర్నిటీ, ఎస్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. ముఖ్యంగా పీహెచ్‌డీ రద్దును వెంటనే ఆపాలని, హెచ్‌సీయూలోని బహుజన విద్యార్థులలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ డ్రాపౌట్‌లను ఆపడంతో బాటు రద్దు చేసిన అడ్మిషన్లను వెంటనే పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీ, మైహోమ్ విహంగా వెనుక వైపు ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని టీఎన్‌జీఓఎస్ ప్రభుత్వోద్యోగులు, రంగారెడ్డి జిల్లా కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌలిదొడ్డి వార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. రాత పూర్వక ఫిర్యాదులో సంఘం అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం సమస్యను వివరించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను అనుమతించవద్దని వారు సూచించారు. స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వార్డు అధికారి హామీ ఇచ్చారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మియాపూర్: విద్యార్థులు కష్టపడి చదవాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో మండల ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు చదువు చెప్పే మయూరీనగర్ కాలనీ దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నియమించిన ఉపాధ్యాయురాలికి గౌరవ వేతనంను చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యానందించేందుకు అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అండగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సుధీర్, అడుసుపల్లి, సుమన్ బత్తుల, ఆంజనేయచౌదరి, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, నిరంజన్, బాలాజీ వర్మ, ధనుంజయరావు పాల్గొన్నారు.

రెండు ఫ్లైఓవర్లకు అనుమతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తదితరులు

శేరిలింగంపల్లి: ఆర్టీసీ కాలనీ, కల్వరి టెంపుల్ రోడ్డులో రెండు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిని ఎమ్మెల్యే గాంధీ, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌లు సోమవారం పరిశీలించారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి వరద నీరు నిలవడానికి గల కారణాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద డ్రెయిన్ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. జీహెచ్ఎంసీ ఈఎన్‌సీ జియాఉద్దీన్, సీఈ సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి,ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈలు శ్రీనివాస్, శ్రీకాంతిని,ఇరిగేషన్ ఎస్ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డీఈ నళిని, ఏఈలు సునీల్, పావని, డాక్టర్లు నగేష్ నాయక్, కార్తీక్ పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

రాయదుర్గం: వర్షం పడితే రోడ్డుపై నీరు నిలిచే ప్రాంతాలపై జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వద్ద రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో జీహెచ్ఎంసీ అధికారుల ఆదేశంపై వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి.

నిరుపేదలకు అండగా ఎన్ఎంఆర్ యువసేన

పటాన్‌చెరు టౌన్: సేవా కార్యక్రమాలతో నిరుపేదలకు ఎన్ఎంఆర్ యువసేన అండగా నిలుస్తుందని యువసేన వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం సేవా కార్యక్రమాల్లో భాగంగా పటాన్‌చెరు పట్టణం హనుమాన్ దేవాలయ సమీపంలో నివసిస్తున్న మహ్మద్ పాష అనే కేన్సర్ పేషెంట్‌కు సరుకులు అందజేశారు. ఎంజీ రోడ్డులో నివసిస్తున్న శివప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా బండ్లగూడలో వివిధ కాలనీలలో ముంపునకు గురైన దాదాపు 80 కుటుంబాలకు సరుకులు అందజేశారు.కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు లక్ష్మి, పాండు, సాయి రాజు,శ్రీకాంత్, భరత్ ,నరసింహ, నీరుడు మౌనిక ,జ్యోతి పాల్గొన్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసేవ, ప్రకృతిసేవ

రాయదుర్గం: వాసవి క్లబ్ మణికొండ ఆధ్వర్యంలో సోమవారం విద్యాసేవ, ప్రకృతి సేవా కార్యక్రమాలను గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు.సభ్యుడు యశ్వంత్ సహకారంతో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో అందరూ కలిసి మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షులు కలగర్ల నిరీషా, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రామ్‌సురేష్, కోఆర్డినేటర్ ఈశ్వర్‌ప్రసాద్, హెచ్ఎం పాల్గొన్నారు.

దారిదోపిడీ కేసులో ముగ్గురు రిమాండ్

- కారు, ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- పాటి సమీపంలో వాహనాల తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రమణకుమార్



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రమణకుమార్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడిచేసి ఏటీఎం కార్డులు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను బీడీఎల్ భానూర్ పోలీసులు అరెస్ట్ చేసి,రిమాండ్‌కు తరలించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రమణకుమార్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డితో కలసి వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు మండలం పాటి చౌరస్తా సమీపంలో ఉన్న ఎంపీఆర్ అర్బన్ సిటీకి చెందిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి రవికుమార్ ఈ నెల 22వ తేదీ మాదాపూర్‌లో మైండ్‌స్పేస్ కంపెనీలో విధులు ముగించుకుని రాత్రి 11.30 ప్రాంతంలో బస్సులో పాటి చౌరస్తాకు వచ్చి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. అను ఫర్నిచర్ సమీపంలోకి రాగానే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి రవికుమార్‌పై దాడి చేయడంతో కింద పడిపోయాడు. రవికుమార్ సెల్‌ఫోన్, జేబులో ఉన్న పర్సు లాక్కుని పరారయ్యారు. పర్సులో రూ. 10 వేలు నగదు, ఐసీఐసీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉండటతో బాధితుడు బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో బాధితుని బ్యాంకు ఖాతా నుండి సంగారెడ్డి ఇండియన్ ఏటీఎం ద్వారా రూ.50 వేలు, సదాశివపేట ఎస్బీఐ ఏటీఎం నుంచి రూ.40 వేలు నగదు డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సీసీ ఫుటేజి ఆధారంగా నగదు తీసుకునేందుకు వచ్చిన కారు నంబర్‌ని గుర్తించారు. కాగా ఈనెల 30వ తేదీన పాటి చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా కారు, వెనుక వచ్చిన స్కూటీని గుర్తించి పట్టుకున్నారు. నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా బీడీఎల్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పటాన్‌చెరుకు చెందిన మహ్మద్ ఆసిఫ్, వినయ్ పాటిల్, మణిదీప్‌రెడ్డిలు దారిదోపిడి చేసింది తామే అని ఒప్పుకోవడంతో వారిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి ఒక కారు, ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించినందుకు సీఐ రవీందర్‌రెడ్డి, సిబ్బంది భాస్కర్, రవీందర్, గోవర్ధన్, పాండురంగంలను అభినందించారు. సమావేశంలో పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేర్‌వెల్.. విద్యార్థుల సందడి

రాయదుర్గం: విద్యార్థులు డ్యాన్సులతో అదరగొట్టారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కాలేజ్‌లో 2021 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు సోమవారం ఫేర్‌వెల్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి సుధీర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎటస్ చంద్రమౌళి, హెచ్‌ఓడీ డాక్టర్ రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు చేసిన డ్యాన్సులు అందరినీ అలరించాయి. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు.



ప్రభుత్వ స్థలం కబ్జా.. ప్రహరీ కూల్చివేత



గచ్చిబౌలి: గోపన్‌పల్లి సర్వే నంబర్ 37లో ప్రభుత్వ స్థలాన్ని రాత్రికి రాత్రే కబ్జా చేశారు. దాదాపు ఎకరం స్థలం చుట్టూ ప్రీ కాస్టింగ్ ఫెన్సింగ్ వేశారు. దాని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.50 కోట్లకు పై మాటే. వీకెండ్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు రావడంతో అదే అదునుగా ఓ వ్యక్తి గౌలిదొడ్డిలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశాడని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆర్ఐ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జేసీబీతో ప్రహరీ గోడను తొలగించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు ప్రారంభించినట్లు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డిలో రూ.87.50 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజు, నాయకులు తిరుపతి, దారుగుపల్లి అనిల్, ప్రసాద్, భిక్షపతి,రమేష్ బాలకృష్ణ, యాదయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: వేమన కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సాయ ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ ప్రాంతాలు...అలాగే 11కేవీ భిక్షపతి ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కైలాష్‌నగర్, జవహర్ కాలనీ, ఓల్డ్ ముంబాయి రోడ్డు ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 170180, పచ్చిమిర్చి 90, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 40, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 30, అల్లం 300, వెల్లుల్లి 220.

శ్రీనివాస్ రాయప్రోల్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: శ్రీనివాస రాయప్రోల్ కవితా పురస్కారానికి రాయప్రోల్ లిటరరీ ట్రస్ట్ దరఖాస్తులను కోరుతోంది. ఆంగ్లంలో కవిత్వం రాస్తున్న వారు (20–40) ఏళ్ళ మధ్య వయస్సు గల భారతీయ పౌరుల నుంచి ఎంట్రీలను కోరుతున్నారు. ఈ పురస్కారాన్ని శ్రీనివాస్ రాయప్రోల్ లిటరరీ ట్రస్ట్ ,హెచ్‌సీయూ ఆంగ్ల విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.అక్టోబర్‌లో జరిగే సాహిత్య కార్యక్రమంలో ఈ పురస్కారం కింద రూ.15వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందించబడుతుంది. ఎంట్రీలు పంపేవారు మూడు వేర్వేరు ప్రచురించని కవితలు పీడీఎఫ్ చేసి పంపాలని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ కాపీలు పంపాలి. ఎంట్రీలను ఈ మెయిల్ ద్వారా సెప్టెంబర్ 3వ తేదీ లోగా పంపాలి. rayaprolutrust@gmail.com లేదా http://www.sri nivasrayaprol.in/ పంపాల్సి ఉంటుంది.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 16 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

చంద్రమౌళీశ్వరునికి ప్రత్యేక అలంకారం



రాయదుర్గం: అధిక శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక



హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లోని ఎస్వీఎస్ ఆవాస గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఆవాస ఫ్లాట్ ఓనర్స్ మెయింటెయినెన్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా నారా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా పవన్, ప్రధాన కార్యదర్శిగా శివ జగన్‌లు గెలుపొందారు. జాయింట్ సెక్రటరీ, సంయుక్త ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్, స్పోర్ట్స్ సెక్రటరిగా వెంకట్, అడ్వైజర్‌గా సోమనాథ కుమార్‌ను ఎన్నుకున్నారు.

సకాలంలో పీఎఫ్ సేవలు

పటాన్‌చెరు: ఉద్యోగుల పింఛను పథకం–1905 ద్వారా ప్రయాస్ కార్యక్రమాలు ప్రతీ నెలా నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి అసిస్టెంట్ కమిషనర్ లు పీ.వీ.రావు, ఆర్. శ్రీదేవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....జూలై నెలలో 41 మందికి పింఛన్లు మంజూరు చేయగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 14 మందికి మంజూరు పత్రాలను అందజేశామని తెలిపారు. చందాదారులకు చేరువయ్యేలా డిజిటల్ విధానాల ద్వారా సకాలంలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఎఫ్ అకౌంట్స్ అధికారి బబుల్‌నాథ్ నాయక్ పాల్గొన్నారు.